క్లుప్తంగా

చలివేంద్రాల ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : వేద గాయత్రి పురోహిత సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. సంఘం అధ్యక్షులు గరిమెళ్ళ భాస్కర్, కార్యదర్శి వేమూరి బాలనాగేందర్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక పేరంపేట రోడ్‌లో శివాలయం, హైస్కూల్ వద్ద శివాలయంలో చలివేంద్రంలు ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ కార్యదర్శి కూచిభట్ల రాము, లంకా నాగకుమార్, చావలి వేంకటేశ్వర్లు, కుందా మణికంత, తంగిరాల సత్యనారాయణ, మేడిచర్ల సూర్యనారాయణ, కుందా శ్రీను, గొర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ. 50 వేల విరాళం



దాత హరిప్రసాద్ దంపతులకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు గుడివాడ మండలం బేతపూడికి చెందిన తుర్లపాటి హరిప్రసాద్ ఆదివారం రూ. 50,400 విరాళంగా అందజేశారు. ముందుగా ఆయన సతీసమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాత దంపతులకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

గురుకుల ప్రవేశ పరీక్షకు 603 మంది హాజరు



ద్వారకాతిరుమలలో విద్యార్థుల పరీక్ష పేపర్లను బాక్స్‌లో పెట్టి సీల్ వేస్తున్న అధికారి

ద్వారకాతిరుమల: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం గురుకుల ప్రవేశ పరీక్షను కట్టుదిట్టమైన భద్రతల నడుమ నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 5వ తరగతి ప్రవేశానికి, అలాగే మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి పరీక్షలు నిర్వహించారు. 5వ తరగతి ప్రవేశానికి 381 మంది విద్యార్థులకుగాను 345 మంది పరీక్షకు హాజరయ్యారు. అలాగే ఇంటర్ ప్రవేశానికి 272 మందికిగాను 258 మంది పరీక్ష రాశారు. పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులతో సందడి నెలకొంది.

సింహాద్రి అప్పన్న చందనోత్సవం

జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయిగూడెం రామాలయంలో సింహాద్రి అప్పన చందనోత్సవం కార్యక్రమాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. సింహాద్రి అప్పన్న క్షేత్రంలో నిర్వహించే విధంగా రామాలయంలో నాలుగు తరాలుగా సింహాద్రి అప్పన్నకు చందనోత్సవ వేడుకను నిర్వహిస్తూ వస్తున్నామని గ్రామ పెద్దలు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని చందనోత్సవ కార్యక్రమాన్ని వీక్షించారు. పూజా కార్యక్రమాల అనంతరం నిర్వహించిన అన్నదానంలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

నేడు అవార్డుల అందజేత

బుట్టాయగూడెం : స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎం. శ్రీహరి తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో అవార్డులను ఎమ్మెల్యే తెల్లం బాలరాజు చేతుల మీదుగా అందజేయనున్నట్లు చెప్పారు. ఎంపీపీ కారం శాంతి, జెడ్పీటీసీ మొడియం రామతులసి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావుతోపాటు మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

7 కరోనా కేసులు

దెందులూరు: దెందులూరు మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం ఏడు కరోనా కేసులు నమోదయ్యాయని దెందులూరు ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి, తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య తెలిపారు. అన్ని గ్రామాల్లో ప్రజలందరూ కరోనా నిబంధనలు పాటిస్తూ, మాస్కులు ధరించి, శానిటైజర్లు వాడాలన్నారు. భౌతిక దూరాన్ని పాటించాలన్నారు.

పేకాట స్థావరంపై దాడి

పెదపాడు: పేకాట ఆడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని ఏపూరు రైల్వే కట్ట వద్ద పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పెదపాడు ఎస్సై తన సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై ఆదివారం దాడి చేసారు. పేకాట ఆడుతున్న ఆరుగురి నుంచి రూ.3,100 స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసినట్లు పెదపాడు ఎస్సై బీ నాగబాబు తెలిపారు.

మంత్రి ధర్మానకు ఘన స్వాగతం



మంత్రి ధర్మానకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, ప్రసాదాలను అందిస్తున్న పార్టీ నేతలు

ద్వారకాతిరుమల : రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు మండల వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం ఘన స్వాగతం పలికారు. దేవరపల్లి, గోపాలపురంలోని పలు ప్రారంభోత్సవ కార్యక్రమాలకు హాజరయ్యేందుకు వెళుతున్న ఆయనను మండలంలోని ఎం.నాగులపల్లి శివారు జాతీయ రహదారిపై మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు తదితరులు ఆయనకు పూల బొకేను అందించి, శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, చెరుకూరి ప్రసాదరావు, పోల్కంపల్లి అనీల్, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, ఉక్కుర్తి వెంకట్రావు, బాలం వెంకటేశ్వరరావు, చెలికాని బుల్లియ్య, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, దాకారపు అగ్గియ్య, నల్లూరి బాపనయ్య, నల్లూరి వెంకన్నబాబు, పెద్దిన దిలీప్, కొండాబత్తుల గిరి, భోగరాజు చిన్న చిన్ని తదితరులున్నారు.

బీసీలకు అధిక సీట్లు కేటాయించిన వారికే మద్దతు

బీసీ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



బీసీ సంక్షేమ సంఘం, బీసీ చైతన్య వేదిక ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : సమగ్ర కులగణన చేపట్టాలని బీసీ నాయకులు కోరారు. పట్టణంలోని సూర్య విద్యాసంస్థల్లో ఆదివారం బీసీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం బీసీ చైతన్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో మల్లవరపు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ కులాలకు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన బీసీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది బీసీ నేత పాకా సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సమగ్ర కుల గణన చేపట్టాలని దానికి త్వరలో ఏలూరు కేంద్రంగా భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కులగణనతో సంబంధం లేకుండా రాష్ట్రంలో ఉన్న అన్ని రాజకీయ పక్షాలు జనాభా దామాషా ప్రకారం బీసీలకు అత్యధిక సీట్లు కేటాయించాలని, అలాగే బీసీలకు అత్యధిక సీట్లు కేటాయించిన పార్టీలకే మద్దతు తెలియజేస్తామని చెప్పారు. ఏలూరు కేంద్రంగా జరిగే బహిరంగ సభకు ప్రతి గ్రామం నుంచి ప్రతి బీసీ వ్యక్తి హాజరయ్యేలా గ్రామాల్లో చైతన్యం చేయాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో బీసీ చైతన్య వేదిక అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాసరావు, మట్ట సత్తిపండు, ఆయినాల వెంకటరమణమూర్తి, సూర్యచంద్ర శ్రీనివాస్, డాక్టర్ దాసరి శ్యామచంద్ర శేషు, శీల వెంకటేశ్వరరావు, రాజాన సత్యనారాయణ, తాతాజీ తూటి కుంట దుర్గారావు, తెలగారపు జ్యోతి, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మేడే పోస్టర్ ఆవిష్కరణ



మేడే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లింగరాజు తదితరులు

ద్వారకాతిరుమల : ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు పిలుపునిచ్చారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లోని రామాలయం వద్ద ఆదివారం సాయంత్రం ఆయన మేడే వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. వాటి వల్ల కార్మికులు అన్ని హక్కులను కోల్పోయి బానిసలుగా పనిచేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 8 గంటల పని హక్కు కోసం మేడే స్ఫూర్తితో మరోసారి పోరాటం చేయాల్సిన పరిస్థితులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి ఆదికృష్ణ, నాయకులు మధు, పేరయ్య, వెంకటేశ్వరరావు, సుబ్బారావు తదితరులున్నారు.

ధ్యానంతో రుగ్మతలు దూరం



విద్యార్థులకు శిక్షణనిస్తున్న వైద్య, ఆధ్యాత్మిక శాస్త్రవేత్త డాక్టర్ ప్రతాప్ కుమార్

ద్వారకాతిరుమల : చిన్నతనం నుంచే విద్యార్థులు ధ్యానం చేయడం అలవరచుకోవాలని వైద్య, ఆధ్యాత్మిక శాస్త్రవేత్త డాక్టర్ ప్రతాప్‌కుమార్ అన్నారు. ద్వారకాతిరుమల శివారులోని శ్రీ శ్రీనివాస స్పిరిచ్యువల్ సైన్స్ అకాడమీలో ఆదివారం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రతాప్ కుమార్ వారికి పలు సూచనలు, సలహాలనిచ్చారు. ధ్యానం చేయడం ద్వారా అన్ని రుగ్మతలు తొలగిపోతాయన్నారు. అలాగే మానసిక ఉల్లాసం, ఆధ్యాత్మిక భావనలు పెంపొందుతాయన్నారు. అనంతరం చిరుధాన్యాలతో తయారు చేసిన పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందజేశారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు



రాత్రివేళల్లో బ్రీత్ ఎనలైజర్‌తో డ్రైవర్‌ను పరీక్షిస్తోన్న పోలీసులు

ఏలూరు టౌన్ : మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఏలూరు వన్‌టౌన్ సీఐ బోణం ఆదిప్రసాద్ తెలిపారు. ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి ఆదేశాలతో ఏలూరు ఇన్‌చార్జ్ డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు పర్యవేక్షణలో నగరంలో వాహన తనికీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే 10 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏలూరు వన్‌టౌన్ సీఐ ఆదిప్రసాద్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపటంతో మీరు ప్రమాదాల బారిన పడడమే కాకుండా ఇతరులకు తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితులు ఏర్పడే ప్రమాదముందన్నారు. మీ కుటుంబ సభ్యులు, పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని సరైన జీవన విధానంతో మెలగాలని హితవు పలికారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరేలా జాగ్రత్తలు పాటించాలన్నారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలతో నిత్యం వాహన తనిఖీలు ఉంటాయనీ, ఎవరినీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో ఏలూరు వన్‌టౌన్ ఎస్సై ఎస్.రామకృష్ణ, ఏలూరు రూరల్ ఎస్సై ఎన్.లక్ష్మణబాబు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మానవత సేవలో భాగస్వాములు కావాలి

భీమడోలు: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆశయ సాధనకు ప్రతి సభ్యుడు తమ వంతు కృషి చేయాలని ఉమ్మడి జిల్లాల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు అన్నారు. పోలసానిపల్లిలోని ఆర్‌బీకే వద్ద ఆదివారం మానవత సంస్థ మండల సర్వసభ్య సమావేశం మండల మానవత సంస్థ అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి మానవత మండల అధ్యక్షుడిగా వట్టి సుగుణాకర్‌ను ప్రతిపాదించారు. ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు, సర్పంచ్ షేక్ రహీమాబేగం హసీనా పాల్గొని ప్రసంగించారు. పోలసానిపల్లిలో సభ్యుల సంఖ్యలో నూరుకు పెంచుతామన్నారు. సంస్థ భవన నిర్మాణానికి సర్పంచ్ రూ.10 వేలు, మాజీ మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ చిలపర్తి రామారాయుడు రూ.5 వేలు, మిరియాల సత్యనారాయణ వెయ్యి రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాంతి రథాల చైర్మన్ అప్పక రాంబాబు, మండల చైర్మన్ గుల్లా నూకరాజు, ప్రముఖ సిద్ధాంతి కాశీబొట్ల కృష్ణ ప్రసాద్‌శాస్త్రి, గ్రామ కన్వీనర్లు డి.రాజేష్, అడపా ప్రసాద్, ఈసీ సభ్యులు ఎం.రమేష్, డి.అనిల్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధాన్యం ఎగుమతులకు కార్యాచరణ

ఉంగుటూరు: ధాన్యం ఎగుమతులు, అమ్మకాల విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహసీల్దారు వెంకటరమణ అన్నారు. ఆదివారం ఉంగుటూరు కైకరం, చేబ్రోలు, గోపీనాథపట్నంలో ధాన్యం పట్టుబడులు, రాశులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 5,240 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు. 24 ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. 6.50 లక్షలు సంచులు రైతులకు పంపిణీ చేశామన్నారు. 97 లారీల ద్వారా ధాన్యం తరలించగా, ఇంకా రోజుకు 120 లారీలు చొప్పున మండలానికి వస్తున్నాయని వాటి ద్వారా ధాన్యం ఎగుమతులకు ప్రణాళిక సిద్ధం చేసి కార్యాచరణ అమలు చేస్తున్నామని తహసీల్దారు వివరించారు.

జగన్ పాలనలో పేదలకు ఆర్థిక చేయూత



తిమ్మిరెడ్డిపల్లిలో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

చింతలపూడి : ప్రతి పేద కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మండలంలోని తిమ్మిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో ఆదివారం గడప, గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఆర్థిక ఇబ్బందులు తొలగిపోయాయని, తామంతా సంతోషంగా ఉన్నామని గ్రామస్తులు ఎమ్మెల్యేకి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూరిందని అన్నారు. గడప, గడపకు వెళ్లినపుడు ప్రజలు ఎదురొచ్చి ఆదరించడమే ఇందుకు నిదర్శనమన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఎవరి సిఫార్సు లేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు నేరుగా అందుతున్నాయని తెలిపారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుని రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే ఎలీజా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ పరాంకుశం వెంకటేశ్వరరావు, గంగవల్లి సురేష్, ఎంపీటీసీ జొన్నకూటి సాగర్, ఈది రాజేష్, మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, నగర పంచాయతీ సచివాలయాల కన్వీనర్ ఎన్ దుర్గారావు, చింతలపూడి నగర పంచాయతీ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, యండపల్లి సర్పంచ్ యడ్ల మోహన్‌రావు, సీహెచ్ జ్ఞానారెడ్డి, జైపాల్, జి.రాంబాబు, సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సాబ్జిపై చర్యలు తీసుకోవాలి

కొయ్యలగూడెం : ఎమ్మెల్సీ షేక్ సాబ్జిపై శాఖాపరమైన చర్యలు శాసనమండలి చైర్మన్, గవర్నర్, ముఖ్యమంత్రి కలిసి తీసుకోవాలని రాష్ట్ర కన్జ్యూమర్ కౌన్సిల్ ఉపాధ్యక్షులు ఏఆర్‌కే హనుమంతరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నకిలీ ఆధార్ కార్డులను ప్రోత్సహించి తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి దర్శనానికి సిఫార్సు లెటర్స్‌లు మంజూరు చేసి సాబ్జి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. దీనిపై టీటీడీ విజిలెన్స్ కూడా స్పందించి నిర్ధారణ చేసిందన్నారు. పెద్దల సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న పెద్దమనిషి ఈ విధంగా వ్యవహరించడం ఒక వర్గానికి చెందిన ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందన్నారు. దీనిపై టీటీడీ చైర్మన్ ఎస్‌వీ సుబ్బారెడ్డికి కౌన్సిల్ తరఫున లేఖను పంపించినట్లు హనుమంతరావు తెలిపారు.

నేడు చొప్పరామన్నగూడెంలో ఎమ్మెల్యే బాలరాజు పర్యటన

కొయ్యలగూడెం : చొప్పరామన్నగూడెం గ్రామంలో సోమవారం పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పర్యటిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు తెలిపారు. ఈసందర్భంగా అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం 4 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు

జంగారెడ్డిగూడెం : రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఐదవ తరగతి, జూనియర్ ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయని ప్రిన్సిపాల్ పి అరుణ తెలిపారు. 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 402 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 365 మంది పరీక్షకు హాజరైనట్లు చెప్పారు. జూనియర్ ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షకు 401 మందికిగాను 322 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరయ్యారన్నారు. పరీక్షకు హాజరైన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు పాఠశాల, కళాశాల సిబ్బంది అల్పాహారంగా పులిహోర, మంచినీళ్ల ప్యాకెట్లు అందించినట్లు తెలిపారు.

నేడు వాహనాల వేలం

ద్వారకాతిరుమల : మండల పరిధిలోని పలు ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ 21 మోటార్‌సైకిళ్లకు స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం బహిరంగ వేలాన్ని నిర్వహిస్తామని ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఈ వేలం పాటలను జరుపుతామన్నారు. ఆసక్తిగల వారు తమ ఆధార్ కార్డులతో ఈ వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఐదు మట్టి ట్రాక్టర్ల సీజ్

జంగారెడ్డిగూడెం : పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐదు మట్టి ట్రాక్టర్‌లను సీజ్ చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు చెప్పారు. అక్రమంగా మట్టి రవాణాచేస్తున్న వేగవరం గ్రామంలో రెండు మట్టి ట్రాక్టర్‌లను, అలాగే పట్టెన్నపాలెం గ్రామంలో మూడు మట్టి ట్రాక్టర్లను సీజ్ చేశారు. వీటిని స్థానిక పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. వీటిపై స్థానిక తహసిల్దార్‌కు నివేదిక ఇచ్చినట్లు ఎస్సై సాగర్‌బాబు చెప్పారు.

నాట్య విద్యార్థులకు ప్రమాణ పత్రాల అందజేత



ప్రమాణ పత్రాలు అందుకున్న నాట్య విద్యార్థినులు, చిత్రంలో నాట్యగురువు ప్రశాంత్‌కుమార్

జంగారెడ్డిగూడెం : కళలను, కళాకారులను ప్రోత్సహించేందుకు రోటరీ ముందుంటుందని రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు దాకారపు కృష్ణ, ఉడా రాంగోపాల్, మాజీ అసిస్టెంట్ గవర్నర్ ధనకుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెంలో మయూర నాట్యాలయ నాట్య విద్యార్థులకు ఆదివారం ప్రమాణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాట్య గురువు ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 22న ఛత్తీస్‌ఘడ్ యూనివర్సిటీ నుంచి ప్రవేశిక పరీక్షలో తమ నాట్య విద్యార్థులు ఉత్తీర్ణులై ప్రమాణ పత్రాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు విద్యార్థులకు ప్రమాణ పత్రాలు అందజేశారు. అలాగే నాట్యాగురువు కళాభివృద్ధికి చేస్తున్న కృషిని అభినందిస్తూ త్వరలో రోటరీ ఆధ్వర్యంలో రోటరీ ఎక్సలెన్స్ అవార్డును అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాకారులు సుబ్బయాచారి, తిప్పాబొట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అక్షయ తృతీయ వేడుకలు



శ్రీకృష్ణ ఆలయంలో భక్తులకు అనుగ్రహ భాషణ చేస్తున్న కేశవ్ గోస్వామి

కొయ్యలగూడెం : అక్షయ తృతీయను పురస్కరించుకుని అచ్యుతాపురం శ్రీకృష్ణ ఆలయంలో ఆదివారం వేడుకలు నిర్వహించారు. పరమ పూజ్యపాద అష్టోత్తర త్రిదిండి స్వామి భక్తి సాదా కేశవ్ గోస్వామి మహారాజ్ భక్తులకు అనుగ్రహభాషణ చేశారు. ఈ సందర్భంగా బలరామ, సుభద్ర సహిత శ్రీ కృష్ణ భగవాన్‌లకు నీరాజన హారతులు అందించి అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. అక్షయ తృతీయ వ్యాపార అవసరాలకు అనుగుణంగా తయారైందని, అయితే అక్షయ తృతీయ ప్రాధాన్యత నేటి ప్రజలకు తెలియకుండా పోతుందన్నారు. అక్షయ తృతీయ రోజు విశేషాలను, ఇతిహాస పురాణాలలో పేర్కొన్న అంశాలను విశదీకరించారు. కొయ్యలగూడెం త్రిశక్తి పీఠం మదన గోపాల స్వామి ఆలయాలలో అక్షయ తృతీయ వేడుకలు నిర్వహించారు.

పునరావాస కాలనీలో 120 మందికి వైద్యసేవలు



ఉచిత వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

జంగారెడ్డిగూడెం రూరల్ : చల్లావారిగూడెం ఆర్అండ్ఆర్ కాలనీలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పాస్టర్ కె.శైలేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో జంగారెడ్డిగూడెంకు చెందిన కాటన్ దొర ఆస్పత్రి వైద్యులు వైద్య పరీక్షలు చేశారు.వైద్యులు ఎం.ఆంజనేయులు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మలేరియా, డెంగీ, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరంలో 120 మందికి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి మేనేజర్ చైతన్య, కాలనీ అధ్యక్షుడు గిల్లా వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ యూత్ అధ్యక్షుడు బద్దే ప్రేమ్‌కుమార్, పెరుమాళ్ల అభి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీయిజం చేస్తే.. తాట తీస్తాం



ఏలూరు టూటౌన్ స్టేషన్ వద్ద రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ చంద్రశేఖర్

ఏలూరు టౌన్ : ఏలూరు టూటౌన్ పరిధిలో ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని ఏలూరు టూటౌన్ సీఐ పి.చంద్రశేఖర్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ డి.మేరీప్రశాంతి ఆదేశాలతో ఆదివారం ఏలూరు టూటౌన్‌లోని రౌడీషీటర్లకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించటమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరించేవారిపై కఠినంగా ఉంటామని స్పష్టం చేశారు. రౌడీయిజం చేస్తాం.. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తాం.. అంటే సహించేదిలేదన్నారు. నగరంలో సెటిల్మెంట్‌లు, దందాలు, గొడవలు చేస్తామంటే తాట తీస్తామని హెచ్చరించారు. రౌడీషీటర్లుగా జీవించడం వల్ల మీ కుటుంబాలకు, పిల్లలకు ఎంతో నష్టం కలుగుతుందన్నారు. ఇకనైనా చెడు నడవడిక విడనాడి మంచి ఉపాధి చూసుకుని జీవనం సాగించాలని హితవు పలికారు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. మీరంతా మారితే మీపై రౌడీషీట్ తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని తెలిపారు. రౌడీషీటర్ల కౌన్సెలింగ్ కార్యక్రమంలో టూటౌన్ ఎస్సై కె.ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

మే 2 నుంచి కావూరిలో కంప్యూటర్ శిక్షణ

ఏలూరు (టూటౌన్) : ఏలూరు వసంత మహల్ సెంటర్ లోని కావూరి ఫౌండేషన్ కార్యాలయంలో మే 2 నుంచి టైపు, కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ పీఆర్‌ఓ పులి శ్రీరాములు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన (పరీక్షలు రాసిన) వారికి టైపు, డీసీఏ, డీటీపీలోనూ, ఇంటర్ కామర్స్ ఉత్తీర్ణులైన వార్కి టాలీలోనూ శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ నెల 24 నుంచి సంస్థ కార్యాలయం వద్ద దరఖాస్తులు అందచేయనున్నట్లు తెలిపారు. ఏలూరు నగరం, పరిసర గ్రామాలకు చెందిన 35 ఏళ్లలోపు యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పులి శ్రీరాములు కోరారు.

ఎకరాకు 110 సంచులు ఇవ్వాలి

భీమడోలు: ఆకాల వర్షం వల్ల ధాన్యం తడిస్తే అందుకు అధికారులే బాధ్యత వహించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. ధాన్యం రవాణాకు లారీలు ఏర్పాటు చేయాలంటూ ఆదివారం జిల్లా కౌలు రైతు సంఘం, రైతు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో పూళ్లలోని నూతుల పుంట రోడ్డుపై రైతులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా తెరవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గోనె సంచులు, రవాణా, హమాలీలు వంటి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఎకరాకు 110 సంచులు ఇవ్వాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.లింగరాజు, జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, కోకన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.